క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



వెంకటయ్యకు తీర్థం అందజేస్తున్న పూజారి

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల భైరవస్వామి ఆలయంలో నవగ్రహాలు, సంతాన నాగేంద్రుల విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఉత్సవాల్లో పాల్గొన్నారు. పూజారులు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి, నాయకులు దూలం కిష్టాగౌడ్, భైరాగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘చెలిమి’ చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: నిరుపేద కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించి మనోధైర్యం కల్పించారు. భరత్‌నగర్‌కు చెందిన గుంటుకు వెంకటేశ్‌కు భార్య పద్మతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3,500 విలువైన నిత్యావసర సరుకులతో పాటు రూ.11,500 అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కిరణ్, సంతోష్, శ్రీనివాస్, రమేశ్, నర్సింహులు, ప్రదీప్, బాబు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేది కొమరయ్యే..



ప్రచారం నిర్వహిస్తున్న భాస్కర్

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ కోరారు. బెజ్జంకిలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేది కొమరయ్యనే అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటర్ స్లిప్‌ల పంపిణీ



ఓటర్ స్లిప్ అందజేస్తున్న బీఎల్‌ఓ

దుబ్బాకటౌన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకున్న ఓటర్లందరికీ బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారని రాయపోల్ తహసీల్దార్ దివ్య చెప్పారు. రాయపోల్ మండల పరిధిలో ఓటర్ స్లిప్‌ల పంపిణీని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఎమ్మెల్సీ ఓటర్ స్లిప్‌లను బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 506, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 19 మంది ఉన్నట్లు చెప్పారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకున్న ఓటర్లందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజున ఎన్నికల కమిషన్ సూచించిన ధ్రువీకరణ పత్రాలు, ఓటర్ స్లిప్ తీసుకువెళ్లి ఓటువేయాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి నేతల శుభాకాంక్షలు



శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తొగుట(దుబ్బాక): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన శంకర్ ముదిరాజ్‌ను మండలానికి చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యకులు చంద్రం, స్వామిరెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కర్నాకర్ పాల్గొన్నారు.

వేతనాలు లేక వెతలు

ఆరు నెలలుగా అందని జీతాలు

- ఇబ్బందుల్లో ఈ–పంచాయతీ ఆపరేటర్లు
- స్పందించని ఉన్నతాధికారులు

గ్రామ పంచాయతీ రోజువారీ కార్యకలాపాలు, నిర్వహణను కంప్యూటరీకరణ చేసేది ఈ పంచాయతీ ఆపరేటర్లు. వారికి ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో తీవ్రమైన ఆర్థికం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట జిల్లాలో 74 మంది ఈ–పంచాయతీ ఆపరేటర్లు ఉన్నారు. వారు పంచాయతీకి చెందిన రోజువారీ కార్యకలాపాలు, జనన, మరణ సర్టిఫికెట్లు, ఇతర నిర్వహణ అంతా కంప్యూటరీకరణ చేస్తారు. సుమారు పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి పంచాయతీల ద్వారానే వేతనాలు చెల్లిస్తున్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో యేడాదిగా కేంద్రం నుంచి ఆర్థిక సంఘం, రాష్ట్రం నుంచి ఎస్‌ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. అప్పటి నుంచి ప్రతినెలా వేతనాలు అందక ఆపరేటర్లు తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.



చిన్నకోడూరు పంచాయతీ కార్యాలయం

పనిభారం పెరిగింది

గతంలో మేజర్ గ్రామ పంచాయతీకి ఒకరిని నియమించుకొని వారి ద్వారా రెండు జీపీల చొప్పున కార్యకలాపాలు కంప్యూటరీకరించేవారు. తర్వాత కాలంలో కొంత మందిని తొలగించి ఎంపీడీఓ కార్యాలయాల్లో ఒకే దగ్గర కంప్యూటరీకరించేలా ఏర్పాట్లు చేశారు. ఈ విధులతో పాటు ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాల అర్జీదారులు, లబ్ధిదారుల నమోదు ప్రక్రియ పంచాయతీ ఆపరేటర్లే నమోదు చేస్తారు. దీంతో వారిపై మరింత పని భారం పడింది. ప్రస్తుతం ఐదు నుంచి ఆరు జీపీలకు ఒక ఆపరేటర్ విధులు నిర్వర్తిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయ పనులు కూడా వారితోనే చేయిస్తున్నారు. దీంతో ఒకవైపు నిర్వహణ భారం కాగా ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



ఈ పంచాయతీ ఆపరేటర్లకు ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. అయినా ఎలాంటి స్పందనా లేదు. అప్పులుచేసి కుటుంబ పోషణ చేయాల్సి వస్తోంది. పెండింగ్ వేతనాలు చెల్లించి, ప్రతి నెలా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– నవీన్, జిల్లా ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత ఆనాటి ఘటనలను పంచుకొన్నారు. ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఘనంగా జ్యోతిర్లింగ పూజ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారీలు ఆదివారం ఘనంగా జ్యోతిర్లింగ పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ డాక్టర్ రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సిద్దిపేటశాఖ నిర్వాహకులు భవాని మాట్లాడుతూ శివరాత్రి పర్వదినం వరకు జ్యోతిర్లింగ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వప్న, శ్రీనివాస్, నర్సింగ్, కవిత, శ్రావణి, భాగ్య, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని నేర్పించే బాల గేయాలు

సిరసం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాలగేయాలు చిన్నారులకు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పిస్తాయని సిద్దిపేట రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పెన్షన్ భవన్‌లో జిల్లా రచయితల సంఘం (సిరసం) ఆధ్వర్యంలో ఆయన రచించిన పసిడి పలుకులు(బాల గేయాలు) పుస్తక పరిచయసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్ననాటి నుంచే బాలలు సాహిత్యంపై ఆసక్తి కనబరిచే విధంగా సాహిత్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో కవులు పెందోట వేంకటేశ్వర్లు, పప్పుల రాజిరెడ్డి, వర్కోలు లక్ష్మయ్య, కేసుగారి రాములు, ఆర్.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

300 మందికి వైద్య పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక కేసీఆర్ నగర్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మంజునాథ, రిచ్ ఆస్పత్రుల సహకారంతో శ్రీరామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 300 మంది చిన్నారులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు రవితేజ, సంతోష్‌కుమార్, చంద్రశేఖర్ ప్రజలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సాయిరామ్, చంద్రం, ఎల్లమ్మ, శ్రీరామకమిటీ అధ్యక్షుడు లింగం తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నిరుపయోగంగా ఓపెన్ జిమ్‌లు

మిరుదొడ్డి(దుబ్బాక): రూ.లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని ఒక్కో గ్రామానికి రూ.10లక్షల నిధులతో పలు చోట్ల ఈ జిమ్‌లు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఓపెన్ జిమ్‌లపై సరైన అవగాహన లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. వ్యాయామం చేయడం వల్ల కలిగే ఆరోగ్య సూత్రాలపై అధికారులు అవగాహన కల్పిస్తే ఓపెన్ జిమ్‌లు వినియోగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని యువత అంటున్నారు.



మిరుదొడ్డిలో అంకారప్రాయంగా మారిన ఓపెన్ జిమ్

కంకర రోడ్డుతో కష్టాలు



కంకర వేసి వదిలేసిన రోడ్డు

- బీటీ వేయకపోవడంతో తప్పని తిప్పలు
- కన్నెత్తి చూడని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ నుంచి వంకాయతండా మీదుగా దాస్ తండా వరకు ఉన్న కంకర రోడ్డుతో స్థానికులు, వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.3.20 కోట్లు మంజూరు కాగా కాంట్రాక్టర్ బిల్లులు రాలేదని కంకరవేసి వదిలేశాడు. దీంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం ప్రమాదాల బారినపడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు కలెక్టర్ దృష్టిసారించి పూర్తి చేయాలని కోరుతున్నారు.

మోదుగ పువ్వుల కనువిందు

మోదుగ చెట్లకు పూసిన పువ్వులు(గోగి పువ్వులు) కనువిందు చేస్తున్నాయి. చెట్ల నిండుగా పూలు ఏపుగా విరబూయడంతో అటుగా వెళ్లే వారిని కట్టి పడేస్తున్నాయి. వాహనదారులు ఫోటోలు తీసుకుంటూ సంబరపడుతున్నారు. దుబ్బాక మండలంలోని అప్పనపల్లి వెళ్లే మార్గంలోని చెలకల్లో అందగా పూసిన గోగిపూల దృశ్యాలను సాక్షి ఇలా క్లిక్ మనిపించింది.

– దుబ్బాక



ఆకర్షిస్తున్న మోదుగ పువ్వులు

ఇన్‌చార్జి ఎంపీడీఓలతోనే సరి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మద్దూరు(హుస్నాబాద్): ధూళ్మిట్టకు రెగ్యులర్ ఎంపీడీఓ లేక ఇన్‌చార్జి ఎంపీడీఓలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. నూతన మండలం ఏర్పాటైనప్పటి నుంచి రెగ్యులర్ ఎంపీడీఓను మాత్రం నియమించడం లేదు. దీంతో నంగునూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధు లు నిర్వహిస్తున్న ప్రభాకర్‌రావుకు గత నెలలో ధూళ్మిట్ట మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉత్తర్వులు జారీచేశారు. కానీ ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించడానికి ప్రభాకర్‌రావుకు పనిభారం, అనారోగ్య కారణాలతో బాధ్యతలు తీసుకోలేదు. దీంతో మద్దూరు ఎంపీడీఓ రామ్మోహన్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయి ఎంపీడీఓను నియమించకపోవడంపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పూర్తిస్థాయి ఎంపీడీఓను నియమించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే సమస్యల పరిష్కారం

- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి
- మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

గజ్వేల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే సమస్యల పరిష్కారానికి బాటలు పడతాయని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని గజ్వేల్‌లో ఆదివారం ప్రచారం చేశారు. నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఖాయం

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్‌ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతుగా గ్రామంలో ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగులకు బాసటగా నిలిచిందన్నారు. పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గయ్య, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నర్సారెడ్డి

గెలిపించుకుందాం

చిన్నకోడూరు(సిద్దిపేట): పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించుకుందామని పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో నరేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు బీజేపీ, బీఆర్‌ఎస్ నేతల ఆటలు కట్టించాలని సూచించారు. సమావేశంలో నాయకులు పరశురాములు, రాజు, రాజేశ్, భూపతిరెడ్డి, గణేశ్, జయంత్, ప్రశాంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింట ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు మండలంలోని దాచారం, నర్సింహులపల్లె, ముత్తన్నపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటువేసి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పిలునిచ్చారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, సందీప్, సంతోష్, రాజమల్లు, మహేందర్, మహిపాల్, మురళి, సత్యం, స్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్: వెంకటాపూర్‌లో ప్రచారం..

యువతి వివాహానికి ఆర్థిక సాయం

మద్దూరు(హుస్నాబాద్): ఓ యువతి వివాహానికి పూర్వవిద్యార్థులు సాయంచేసి అండగా నిలిచారు. మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన బొడికే స్వామి కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆదివారం అతడి పెద్ద కుమార్తె శిరీష వివాహం సందర్భంగా 1990–91లో పదోతరగతి చదువుకున్న స్నేహితులు రూ.41 వేలు అందజేశారు. అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులకు శిరీష, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

జహీరాబాద్: టీపీటీఎఫ్, యూటీఎఫ్ తదితర యూనియన్ల మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయా యూనియన్ల నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమ నేత అశోక్‌కుమార్‌ను గెలిపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జహీరాబాద్‌లో ఆయా యూనియన్ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరం



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేటఅర్బన్: చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని, దానివల్ల మానసిక ఒత్తిడి తగ్గి చదువులో రాణిస్తారని ఢిల్లీపబ్లిక్ స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి సుభాష్, చైర్మన్ వడ్డేపల్లి బాలకృష్ణ అన్నారు. ఆదివారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తే ధ్యేయంగా ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. చదువుతోపాటు ఇతర రంగాలలోను విద్యార్థులు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీజ, వినాయకరావు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గే జయంతి వేడుకలు

సంగారెడ్డి రూరల్: ప్రముఖ సంఘ సంస్కర్త వాగ్గేయకారుడు సంత్ గాడ్గేబాబా జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఐలమ్మచౌక్ వద్ద ఆయన చిత్రపటానికి రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రజక సంఘం సమితి అధ్యక్షుడు నగేశ్ మాట్లాడుతూ.. గాడ్గే బాబా ఆధ్యాత్మిక విషయాలను బోధించడంతో పాటుగా సాంఘిక సమస్యల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించేవారని అన్నారు. ఆయన ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామంలోని మురుగు, చెత్తను శుభ్రపరిచేవాడన్నారు. పరిశుభ్రతకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా పేరు పొందారని తెలిపారు. సంత్ గాడ్గే బాబాకి భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీజీఓ అధ్యక్షుడు వైద్యనాథ్, ఫోరమ్‌ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, సజ్జద్‌ఖాన్, మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఊరూరా ‘బెల్ట్’ దందా

యథేచ్ఛగా మద్యం అమ్మకాలు

- ఎన్నికల కోడ్ ఉన్నా పట్టింపులేదు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఊరూరా బెల్టు షాపులు వెలుస్తుండటంతో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. సులువుగా ఆదాయం వచ్చే వ్యాపారం కావడంతో అక్రమమని తెలిసినా పల్లెలే బార్లను తలపించేలా సిట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు మూరుమూల పల్లెల వరకు ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. గ్రామాల్లో వీధివీధినా కిరాణా దుకాణాల్లోనూ విక్రయాలు సాగుతున్నాయి. బెల్టుషాపులపై కొరడా ఝుళిపిస్తున్న పోలీస్, ఎక్సైజ్‌శాఖ అధికారులు నామమాత్రపు జరిమానాలు విధించి వదిలేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.



ఇబ్రహీంనగర్ బెల్టుషాపులో పట్టుబడ్డ మద్యాన్ని చూపుతున్న ఏసీపీ మధు

విమర్శల వెల్లువ

గ్రామాల్లోని బెల్టు షాపులకు నిర్వాహకులు మద్యాన్ని లైసెన్స్ ఉన్న దుకాణాల నుంచే ఆటోల ద్వారా తరలిస్తున్నారు. అయినప్పటికీ బెల్టు షాపులను మాత్రం ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. బెల్టు షాపుల్లో 24 గంటలు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. యువకులు మద్యానికి బానిసవుతున్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. కొందరు తాగి గొడవ పడుతూ పోలీస్‌స్టేషన్‌ల వద్దకు వెళ్తున్నారు. మద్యం మత్తులో వాదోపవాదాలు చేసుకోవడం పరపాటిగా మారింది. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు. చేసినా తూతూ మంత్రంగానే సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

మద్యం అమ్మితే చర్యలు

గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. నిత్యం దాడులు చేస్తూనే ఉన్నాం. ఎవరైనా మద్యం విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి.

– బాలకృష్ణ, చిన్నకోడూరు ఎస్‌ఐ